ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 26.0



తండ్రి మనోజ్‌కు పాదపూజ చేస్తున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

నాన్నకు ప్రేమతో..

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఫాదర్స్ డే సందర్భంగా పలు చోట్ల పిల్లలకు వారి తండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్‌కు ఆదివారం పాద పూజ చేశారు. అన్నీ తానై తనను ఉన్నత స్థాయిలో చూడాలని తండ్రి కృషి, శ్రమ మరువలేనిదని వైష్ణవి అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.60 లక్షల విరాళం ఇచ్చేందుకు తన తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉందని కూడ ఆమె భావోద్వేగంతో తెలిపారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

గిరిజనుల అభివృద్ధికి ఉత్కర్ష అభియాన్ దోహదం

ఏలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దర్తీ అబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అబియాన్ గిరిజనుల అభ్యున్నతికి దోహదపడుతుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గిరిజనుల సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై అవగాహన కలిగించేందుకు ఈ నెల 16 నుంచి 30 వరకు గిరిజన గ్రామాల్లో అవ గాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సామాజిక, మౌలిక సదుపయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, జీవనోపాధిలో కీలకమైన అంతరాలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం అమలు లక్ష్యమన్నారు. సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాములు నాయక్, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్‌ఎస్‌లో జేసీ

ఏలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో కేంద్ర సాధికారిత కమిటీ రాక సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత ప్రాంతాల్లో సోమవారం పర్యటిస్తారు. కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి వినతులు స్వీకరిస్తారని జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అర్జీ అందించవచ్చన్నారు.

జంగారెడ్డిగూడెంలో ఎస్పీ..

జంగారెడ్డిగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్.కిశోర్ సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని డీఎస్పీ యు. రవిచంద్ర ఆదివారం తెలిపారు. ప్రజల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెంలో పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సమస్యలపై వినతులు అందజేయాలని ఆయన సూచించారు.



వాహనదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

విజిబుల్ పోలీసింగ్

ఏలూరు క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ, రహదారి ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం ఆదివారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. జాతీయ, రాష్ట్రీయ రహదారుల్లో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. వాహన తనిఖీ నిర్వహించారు. నిర్లక్ష్య డ్రైవింగ్, వాహన రికార్డులు సరిగా లేనివారికి జరిమానా విధించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణా జరుగకుండా వాహనాల తనిఖీలు నిర్వహించారు.

గోవిందా.. గోవింద

ద్వారకాతిరుమలలో భక్తుల రద్దీ



దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి చోరీ

60 కాసుల బంగారు ఆభరణాలు అపహరణ

లోపలి పేజీలో..

కొల్లేరు సమస్యలు కోకొల్లలు



ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మంచినీటి సరస్సు కొల్లేరు కాస్త కాలుష్య కాసారం కావడానికి వీల్లేదు. పర్యావరణ పరిరక్షణ దిశగా కాలుష్యాన్ని నియంత్రించాల్సిందే. ఆక్రమణలను తొలగించాల్సిందే. అంతకుమించి కొల్లేరు పరీవాహకంలో పక్షుల అభయారణ్యం పరిరక్షణకు ఎలాంటి అవరోధాలు ఉండరాదు. అన్నింటి కంటే మించి కాంటూరు పరిధిని నిర్దేశించాల్సిందే.

సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశం

దశాబ్దాలుగా కొల్లేరునే నమ్ముకున్న వారి జీవనోపాధికి ఎలాంటి లోటు రానివ్వకూడదు. పక్షులతో పాటు మమ్మల్ని బతకనివ్వండి. తరతరాలుగా ఇక్కడ బతుకీడ్చుతున్న వారు రెక్కాడితే.. డొక్కాడని పేదలే. సొసైటీల పేరుతో ఇప్పటిదాకా కాస్తోకూస్తో బతికాం. జిరాయితీ భూములు విషయంలోనూ చాన్నాళ్లుగా ప్రాధేయపడుతూనే ఉన్నాం. కాంటూరు పరిధిని కుదించి న్యాయం చేయాలని అధికారంలోకి వచ్చిన ప్రతీ ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాం. ఇప్పటికీ అది జరగనేలేదు. కాస్తంత మీరైనా కలగజేసుకోండి..

కొల్లేరు వాసుల ఆక్రందన

శాశ్వత పరిష్కారం లభించేనా..?

- దీర్ఘకాలిక సమస్యకు అంతమెప్పుడు?
- పక్షులు, పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధికి ప్రాధాన్యం ఇవ్వాలి
- కాంటూరు కుదింపు కష్టాలు తొలగించాలి
- జిరాయితీ, సొసైటీ భూములే కాదు జీవనాధారం ముఖ్యం
- కేంద్ర సాధికార కమిటీ రాక
- మరోవైపు సుప్రీంకోర్టు దిశా నిర్దేశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

దశాబ్దాల తరబడి కొల్లేరు పేరెత్తితే సమస్యలు కొకొల్లలు. ఎవరిని కదిపినా కన్నీటి గాథలే. చాన్నాళ్లు కొల్లేరును ఆక్రమించి దోచుకున్న పెద్దలు లేకపోలేదు. ప్రశ్నించి, నిలదీసిన పేదలను వెలివేసిన ఘటనలెన్నో. కొల్లేరు మంచి నీటి సరస్సుగా తిరిగి పునరుద్ధరణ జరగాలని సంవత్సరాల క్రితం సుప్రీం సాధాకార కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆనాడు కొల్లేరు పరిధిలో ఉన్న దాదాపు 56వేల ఎకరాలకు పైగా ఆక్రమణలను ధ్వంసం చేశారు. ఎక్కడా చేపల చెరువు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొల్లేరు ఆపరేషన్ పేరిట దాదాపుగా 120 రోజుల వ్యవధిలో పని పూర్తి చేశారు. ఒక సమస్య తీరినా జీవనాధార సమస్య ఇంకా వెన్నాడుతూనే ఉంది. ప్రత్యేకించి ఎన్నికలు జరిగిన ప్రతీసారీ ఈ సమస్య పరిష్కరించేది తామేనంటూ ఏదో పార్టీ కొల్లేరు వాసుల్ని నమ్మబలుకుతూ ఓట్లను కూడగట్టుకుంది. ఈ లోపే స్థానికంగా సమస్యలు ముదిరి, వివాదాలు తలెత్తి ఆఖరికి 'వెలి' వేసేందుకు పెద్దలు వెనుకాడలేదు. ఇక్కడ సామాజికపరమైన సమస్యే కాకుండా, రాజకీయ సమస్య కూడా తోడైంది. ఇలాంటి తరుణంలోనే పర్యావరణ

మిగతా 8వ పేజీలో..

కొల్లేరు సమస్యకు మానవీయ పరిష్కారం లభించాల్సిందే. సరస్సును పరిరక్షిస్తూనే స్థానికులకు న్యాయం చేయాలి. జిరాయితీ, డి-పట్టా రైతుల హక్కులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. పర్యావరణంతో పాటు స్థానికుల జీవనావకాశాలు మెరుగుపర్చడం కూడా అంతే ముఖ్యం. 2014-19 మధ్య సుమారు 20 వేల ఎకరాల భూముల విషయమై కొంత మినహాయింపు ఇవ్వాల్సిందేనని అప్పటి ప్రభుత్వం గట్టిగానే కోరింది. కొల్లేరులో కాంటూరు కుదింపు ముఖ్య సమస్య.

అధికారిక సమీక్షలో వాదనలు

కొల్లేరులో నివసిస్తున్న కుటుంబాలకు జీవనోపాధి కల్పన, శాశ్వత ప్రాతిపదికన ఆదుకోవడానికి పక్కా ప్రణాళిక ఉండాలి. నిబంధనలతో పాటు వారందరికి బతికే హక్కు కూడా ఉంది. వారి విషయంలో మానవతా దృక్పథంతో నిర్ణయాలు జరగాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం కొల్లేరు వాసులకు మెరుగైన జీవితం అందించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. దీనికి తగ్గట్టుగానే సానుకూల దృక్పథంతో కొల్లేరును చూడాలి.

పార్లమెంట్‌లో ఎంపీ మహేశ్ యాదవ్

కాంటూరు తేలదు.. జీవనోపాధిపై స్పష్టత లేదు..!



కొల్లేరు ఆపరేషన్ సమయంలోనే కాంటూరు కుదింపు అంశం బలంగా వినిపించింది. ఇది జరిగితే జిరాయితీ, సొసైటీ భూములను గుర్తించడమే కాకుండా, మిగులు భూములను పేదల పరం చేయవచ్చని ఒక ప్రతిపాదన.

దీనికనుగుణంగానే కొల్లేరు పరీవాహకంలో దాదాపు 3 లక్షల మందికి పైగా తమకు జీవనోపాధి చూపించాలని పదే పదే ప్రాధేయపడుతున్నారు. కొల్లేరు ఆపరేషన్ ముందు, ఆ తర్వాత కూడా ఈ డిమాండ్ వినిపిస్తూనే వచ్చింది. ఈ తరుణంలోనే కొల్లేరు కాంటూరు పరిధిని స్పష్టంగా నిర్దేశిస్తూ నివేదిక తమకు సమర్పించాలని గత ఏడాది చివరిలో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో కొల్లేరు విస్తరించి ఉండడమే కాకుండా కాంటూరును పూర్తిగా నిర్దేశించడం అధికార యంత్రాంగానికి కష్టంగా మారింది. సంక్రాంతి పండుగ తర్వాత నివేదిక ఉన్నత న్యాయస్థానం ఆశించింది. ఇలాంటి పరిస్థితుల్లో తాము బతకడం ఎలా అంటూ మరోసారి స్థానికులు డిమాండ్ లేవనెత్తారు. తమ జీవనోపాధికి అవసరమైన జిరాయితీ, సొసైటీ భూములను తమకు పంచాలన్న డిమాండ్ భారీగా పెరిగింది.

ఒకవైపు కొల్లేరు అంశం ఉన్నత న్యాయస్థానం పరిధిలో ఉండడం, వేరెవరి జోక్యానికి తావు లేకపోవడం ఒకింత అవరోధంగా మారింది. దీనికితోడు కొల్లేరు అంశం క్లిష్టంగా మారడమే కాకుండా పార్లమెంట్‌లో ప్రస్తావనకు వచ్చింది. ప్రత్యేకించి స్థానికుల జీవనోపాధి అత్యంత ముఖ్యమైన అంశంగా వివరించే ప్రయత్నం జరగడమే కాకుండా కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం ప్రయత్నించింది.

రైతులకు.. పగాకు

వర్జీనియా పొగాకు రైతులకు గిట్టుబాటు ధరతో వణుకు వస్తోంది. ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో పొగాకు సాగు చేసిన రైతులు నష్టాల భయంతో గగ్గోలు పెడుతున్నారు. దిగుబడి బాగున్నా ధరలు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.



- గిట్టుబాటు కాని ధర
- పొగాకు బేళ్లు వెనక్కి..
- వర్జీనియా రైతుల గగ్గోలు
- ఎకరాకు రూ.3 లక్షల ఖర్చు
- పెట్టుబడి దక్కదని ఆందోళన
- ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్

జంగారెడ్డిగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పొగాకు వేలం కేంద్రాలకు రైతులు పొగాకు తీసుకువచ్చినా ధర లభించక 50 శాతం బేళ్లు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెబుతున్నారు. దాదాపు ఐదు సార్లు తన బేళ్లు వెనక్కి వెళ్లిపోతున్నాయని కొయ్యలగూడెం మండలం రామానుజపురానికి చెందిన ఏసులంక నాగార్జున వాపోయాడు. ప్రతీ రోజు వందల్లో బేళ్లు వెనక్కి వెళ్లిపోతున్నాయి. దీంతో రైతులకు అదనంగా రవాణా ఖర్చు చేయాల్సి వస్తుంది.

గత ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో పొగాకు సాగుపై రైతులు ఆసక్తి కనబరిచారు. జంగారెడ్డిగూడెంలోని పొగాకు కేంద్రం (18) పరిధిలో 12.64 మిలియన్ల పొగాకు పండించాలని రైతులకు పొగాకు బోర్డు నిర్దేశించింది. 2500 మంది రైతులు 6275 హెక్టార్లలో 18 మిలియన్ల పొగాకు పండించారు. జంగారెడ్డిగూడెం పొగాకు కేంద్రం (32) పరిధిలో 13.15 మిలియన్ కిలోల పొగాకు పంట లక్ష్యం. 2826 మంది రైతులు 6868.47 హెక్టార్లలో దాదాపు 19.5 మిలియన్ కిలోల పొగాకు పండించారు. రెండు వేలం కేంద్రాల పరిధిలో లక్ష్యానికి మించి దాదాపు 12 మిలియన్ల కిలోల పొగాకు అదనంగా పండించారు. వేలం కేంద్రం 18 పరిధిలో గత ఏడాది సరాసరి ధర 323.40 కాగా గరిష్ఠ ధర రూ.410, కనిష్ఠ ధర రూ.100 పలికింది. వేలం కేంద్రం 32 పరిధిలో గత ఏడాది సరాసరి ధర రూ.323.44 కాగా గరిష్ఠ ధర రూ.411, కనిష్ఠ ధర రూ.100 పలికింది.

ప్రస్తుతం కిలో పొగాకుకు సరాసరి ధర రూ.275 ఉండగా గరిష్ఠ ధర రూ.290, కనిష్ఠ ధర 220 ఉంది. ఈ ధరలు ఇలానే కొనసాగితే రైతులు తీవ్రస్థాయిలో నష్టపోయే అవకాశముంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే బోర్డు ఇచ్చిన కోటా కంటే ఎక్కువగా పండించిన పొగాకుకు బోర్డు అధికారులు పెనాల్టీ వేస్తే రైతులు మరింత నష్టపోతారు. ప్రభుత్వం పొగాకు ధరలపై దృష్టిపెట్టి గిట్టుబాటు ధర వచ్చేలా సహకరించకపోతే పొగాకు రైతులు తీవ్రంగా నష్ట పోతారు.

నత్తనడకన సాగుతున్న కొనుగోళ్లు

పొగాకు కొనుగోళ్లు మార్చి 24న ప్రారంభం కాగా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-1లో 4.36 మిలియన్ల పొగాకు, వేలం కేంద్రం-2లో 3.82 మిలియన్ల పొగాకును బయ్యర్లు కొనుగోలు చేసినట్లు వేలం కేంద్ర అధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్ర తెలిపారు. నాణ్యమైన పొగాకు అమ్ముకోవాలని సూచిస్తున్నారు. పొగాకు గ్రేడింగ్ చేసి హీట్ సక్రమంగా పెట్టుకోవాలని తెలిపారు. డ్యామేజి లేని నాణ్యమైన పొగాకుకు గరిష్ఠంగా రూ.290 ధర వస్తుందని తెలిపారు.



ఎకరాకు రూ.3 లక్షల ఖర్చు

ఎకరాకు సుమారు రూ.3లక్షల వరకు ఖర్చులయ్యాయి. ప్రస్తుత ధరతో రైతులు ఎకరాకు రూ.లక్ష నష్టపోతారు. కిలో పొగాకు సరాసరి ధర రూ.330 రావాలి. ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో వర్జీనియా పొగాకు రైతు నాయకులంతా ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేస్తున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేయాలని కోరతాం.

సత్రం వెంకట్రావు, రైతు సంఘ అధ్యక్షుడు



నష్టానికే అమ్మాను

పొగాకును నష్టంతోనే అమ్మాను. సరాసరి ధర రూ.230 మాత్రమే వచ్చింది. ఇప్పటివరకు 200 క్వింటాళ్ల పొగాకు అమ్మాను. మరో 400 క్వింటాళ్ల పొగాకు అమ్మాల్సి ఉంది. ఇవే ధరలు కొనసాగితే పూర్తిగా నష్టపోతాను. ధరలు పెరగక పోతే నష్టాల ఊబిలో కూరుకుపోతాను. ప్రభుత్వం, పొగాకు కంపెనీలతో సంప్రదించి రైతులకు గిట్టుబాటుధరలు వచ్చేలా చూడాలి.

పొన్నగంటి అనిల్, రైతు, తాడువాయి




ఐదుగురి పిల్లలతో తల్లిదండ్రులు ప్రసాద్, నిర్మల జ్యోతి

ఐదుగురు పిల్లలకు రూ.65వేలు

పెదవేగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన కలపాల ప్రసాద్, నిర్మల జ్యోతి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. తల్లికి వందనం పథకంలో ఐదుగురికి రూ.65 వేలు తల్లి ఖాతాలో జమ అయ్యాయి. పెద్ద కుమార్తె హైమశ్రీ ఇంటర్ సెకండియర్, రెండో కుమార్తె గాయత్రి పదో తరగతి వట్లూరు గురుకుల విద్యాలయంలో చదువుతున్నారు. మూడో కుమార్తె సుగుణమ్మ 9వ తరగతి, నాలుగో కుమార్తె మహారాణి 7వ తరగతి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. కుమారుడు సుందర్ రోచన్ మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. ఐదుగురికి రూ.65 వేలు జమ కావడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కొందరు విద్యార్థులకు జాప్యం



వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

ఏలూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదు. 8, 9 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 694 మంది తల్లుల ఖాతాలో ఇంకా డబ్బులు జమ కాలేదు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 3186 మందికి కూడా రాలేదు. వారంతా కంగారు పడాల్సిన అవసరం లేదని సాంఘిక సంక్షేమ శాఖ ఈడీ ముక్కంటి తెలిపారు. సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించి సమస్య తెలుసుకోవాలని సూచించారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రెండో విడతలో వస్తుందన్నారు. అర్హుల జాబితాలో ఉండి సొమ్ములు పడకపోయినా ఇబ్బంది లేదన్నారు.

సచివాలయాలలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలని సూచించారు.

మిగతా 8వ పేజీలో..

ఎండ, మబ్బుల వాతావరణంలో ఆకాశం ఎర్ర రంగు పులుముకుంది. ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉన్నా మరోవైపు మబ్బుగా ఉంది. ఆదివారం సాయంత్రం సూర్యాస్తమయం వేళ ఆకాశం అరుణ వర్ణంతో ఆహ్లాదంగా కనిపించింది. కొబ్బరి చెట్ల మధ్య ప్రకృతి వర్ణం అలరించింది. సూర్యుడు అస్తమిస్తున్న వేళ మబ్బులు ముచ్చట గొలిపాయి.

- కలిదిండి, ఆంధ్రజ్యోతి



దిక్సూచి



ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచ్‌లు ఏమిటో చూద్దాం.

ఐఐటీల్లో

1. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్

ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.

ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.

భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్

అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.

అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.

భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్

ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.

అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.

ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్, ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్టులు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)

ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ

క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.

అవకాశాలు: క్వాంటమ్ అల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటన్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.

భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫీ, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్

ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.

అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్

ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.

భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.

6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)

ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్

మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ

కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.

అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.

జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.

భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జి క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నిటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+సైకాలజీ)

గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నిటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.

అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథిస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.

భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్, ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మాను ఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్

అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలీకామ్ కంపెనీల్లో, ఎల్‌అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐఓటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.

భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)

అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.

ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈబీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.

జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.

భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పెస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'కీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయిన్‌బిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహా ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్స్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్ల స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా... గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏవైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరఫున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.



'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కుర్ రామ్‌మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు ఆల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటే సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.



గోవిందా.. గోవింద

శ్రీవారి సన్నిధిలో భక్తులు కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యసన్నిధి ఆదివారం భక్తజనులతో నిండిపోయింది. సెలవురోజు కావడంతో ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. గోవిందా.. గోవింద అంటూ శ్రీవారి నామస్మరణ మార్మోగింది. దాదాపు 15వేలకు పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్టు ఆలయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఉచిత తీర్థప్రసాదాలు, ఆ తరువాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.


భక్తులతో నిండిన వైకుంఠం క్యూకాంప్లెక్స్


సుభద్ర, బలభద్ర జగన్నాథుని దారు విగ్రహాలు

27 నుంచి జగన్నాథుని రథోత్సవాలు

ద్వారకాతిరుమల : శతాబ్ధకాలం నాటి పురాతన చరిత్ర గల లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 6 వరకు జగన్నాథుని రథోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పూరి క్షేత్రంలో మాదిరిగా ఇక్కడ శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వహిస్తోంది. ఈ మేరకు పూరి క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలు ఉత్సవక్రతువులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా ఈనెల 27న రథ వాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి సాయంత్రం ఐదు గంటలకు శ్రీవారి క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన వచ్చేనెల ఆరో తేదీన ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి సాయంత్రం ఐదు గంటలకు రథయాత్రగా వెళ్లనున్నారు. ఈ ఉత్సవాలను దర్శించి భక్తులు తరించాలని ఆయన కోరారు.


చిట్టూరి ఇంద్రయ్య కాలేజీ గ్రౌండ్‌లో నడుస్తున్న వాకర్స్ (ఇన్‌సెట్‌లో) బంతి తగలడంతో గాయపడిన కృష్ణంరాజు (ఫైల్)

దెబ్బలు తగులుతున్నాయ్..

యువత క్రికెట్ ఆటలతో వాకర్స్‌కు ఇబ్బందులు

తణుకు, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణం రాష్ట్రపతి రోడ్డులో ఉన్న చిట్టూరి ఇంద్రయ్య కాలేజీ గ్రౌండులో ఉన్న వాకింగ్ ట్రాకులో వాకింగ్ చేసే వాకర్స్‌కు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో వందలాది మంది వాకర్స్ వస్తుంటారు. అదే సమయంలో కొంతమంది యువత ట్రాకు మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో క్రికెట్, గూటీబిళ్ల ఆటలు ఆడుతుంటారు. ఎక్కువ సార్లు యువత ఆడుతున్న క్రికెట్ బాలు తగలడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్రికెట్ ఆడే యువకులకు ఎన్ని దపాలుగా చెప్పినా ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని వాకర్స్ వాపోతున్నారు. ప్రతి రోజు ఎవరో ఒకరికి బంతి దెబ్బలు తగలడం అలవాటుగా మారిపోయింది. ఇటీవల వాకింగ్ చేస్తున్న పేరిచర్ల కృష్ణంరాజుకు క్రికెట్ బంతి వచ్చి ముక్కుమీద తగిలి గాయమైంది. ఇటు యువత, అటు వృద్ధులు, యువకులు అంతా ఆరోగ్యం కోసం పలు రకాలు ఆటలు, వాకింగ్, జిమ్‌లు వంటివి చేస్తున్నారు. ఎవ్వరికి ఇబ్బందులు కలగకుండా ఆడుకోవాల్సిన అవసరం ఉంది. రోడ్డుకు ఆనుకుని ఉండడం వల్ల చాలా మంది కాలేజీ గ్రౌండ్‌కు వచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇదే మైదానం నుంచి ఎంతో మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లిన వారు ఉన్నారు.. కానీ ప్రస్తుత సమస్యను ఇరువురు సానుకులంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మహిళా వాకర్సు కూర్చునే సిమెంటు బల్లలు ఉన్న ప్రాంతంలో ప్రత్యేకంగా నెట్ ఏర్పాటు చేసినట్టయితే సమస్య పరిష్కారం అవుతుంది. ఈవిధమైన చర్యలు తీసుకోవాలని పలువురు వాకర్స్ కోరుతున్నారు.

- తణుకు చిట్టూరి ఇంద్రయ్య కాలేజీ గ్రౌండ్‌లో ప్రత్యేక నెట్ ఏర్పాటు చేయాలని వాకర్స్ వినతి

ఇబ్బందులు ఉండకూడదు



కాలేజీ గ్రౌండ్‌లోకి వచ్చే ఏ ఒక్కరికి ఇబ్బందులు ఉండకూడదు. ఇక్కడకు వచ్చే వారు తమ ఆరోగ్యం కోసం వస్తుంటారు. అయితే ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలి. క్రికెట్ బంతి తగిలి చాలామంది వాకర్‌లకు గాయాలవుతున్నాయి. ఈ పరిస్థితులు తలెత్తకుండా చూడాలి.

- కోడూరి ఆంజనేయులు, వాకర్

నెట్ ఏర్పాటు చేయాలి



వాకింగ్ సమయంలో అలసిపోయిన మహిళలకు విశ్రాంతి సమయంలో కూర్చునే బల్లల వద్ద ప్రత్యేకంగా రక్షణ ఏర్పాటు చేయాలి. దీనిలో భాగంగా రక్షణగా నెట్ ఏర్పాటు చేయాలి. ప్రతి రోజు మహిళలతో పాటు ప్రతిఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలి.

- కల్లూరి స్వరాజ్యలక్ష్మి, వాకర్

164 మంది రెగ్యులర్ ఏఎన్ఎంలకు బదిలీలు

- నిబంధనల ప్రకారమే కౌన్సెలింగ్ పూర్తి చేశామన్న ఏవో
- గ్రేడ్-3 ఏఎన్ఎంలకు పదోన్నతి కౌన్సెలింగ్ పూర్తిచేసేందుకు కసరత్తు

ఏలూరు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్ఎంలకు ఆదివారం సాధారణ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకేచోట ఐదేళ్లకుపైగా పనిచేస్తున్న ఏఎన్ఎంలను తప్పనిసరిగా బదిలీ చేయాలనే మార్గదర్శకాల మేరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 190మందిని గుర్తించి, 164 మందిని బదిలీ చేశారు. అయితే సీనియార్టీ జాబితా ప్రకారం ప్రాధాన్యతాక్రమంలో కౌన్సెలింగ్ నిర్వహించలేదని విమర్శలు వెల్లువెత్తాయి. జిల్లావ్యాప్తంగా వున్న పలు వెకెన్సీలను బదిలీ కౌన్సెలింగ్‌లో బహిర్గతం చేయలేదని చెబుతున్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పౌజ్, తదితర స్పెషల్ పాయింట్లున్న ఏఎన్ఎంలకు తొలి ప్రాధాన్యతనివ్వడంలో అభ్యంతరాలు వ్యక్తం కానప్పటికీ, మిగతావారి విషయంలో కౌన్సెలింగ్ మార్గదర్శకాలకు విరుద్ధంగా బదిలీలు చేశారని ప్రచారం జరుగుతోంది. కాగా గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలకు ఎంపీ హెచ్‌ఏ(ఫిమేల్) పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో ఆదివారం రాత్రి 8.30 గంటల తర్వాత ప్రారంభించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

బదిలీలు పారదర్శకంగా జరిగాయి

రెగ్యులర్ ఏఎన్ఎంలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఉమ్మడి జిల్లాలో 164మందిని కోరుకున్న స్థానాలకు బదిలీ చేశాం. బదిలీ వద్దన్న మరో 20 మందిని రిటైన్ చేశాం. బదిలీల్లో పూర్తి పారదర్శకతను పాటించాం. అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నపాటి సాంకేతిక సమస్యలవల్ల ఉద్యోగుల్లో అపోహలు వచ్చాయి. గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలు 256మందికి ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్)ఉద్యోగులుగా పదోన్నతిచ్చే కౌన్సెలింగ్‌ను ఆదివారం రాత్రి ప్రారంభించి, ఎంత ఆలస్యమైనా పూర్తిచేస్తాం.

- డాక్టర్ గంగాభవాని, డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో

పెరుగుతున్న ఉల్లి

ఉల్లి కేజీ రూ.24.. మరింత పెరుగుతాయంటున్న వ్యాపారులు

తాడేపల్లిగూడెం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఉల్లిపాయల ధరలు పెరగడం పారంభమయ్యాయి. మిగిలిన కూరగాయల ధరలు నిలకడగా ఉన్నప్పటికీ ఉల్లిపాయల ధర మాత్రం పెరుగుతున్నాయి. గతవారం కేజీ రూ.20 ఉండేవి.. ఈవారం తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కిలోకి రూ.4 పెరిగింది. ఆదివారం మార్కెట్‌లో కేజీ రూ.24 చొప్పున అమ్మకాలు జరిగాయి. రాబోయే రోజుల్లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల మహారాష్ట్రలో కురిసిన వర్షాల వల్ల ఉల్లి తడిసి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తక్కువగా దిగుమతి అవుతోంది. దీంతో ఉల్లి ధర పెరగడం ప్రారంభించింది. బస్తా(50 కేజీలు) నాణ్యమైనది రూ.1200కు విక్రయిస్తున్నారు. గత నెల వరకు ఈ రకం రూ.1000కే అమ్మేవారు. ఇప్పుడు నాణ్యమని చెప్పే ఉల్లి కూడా నిల్వకు ఆగదని వ్యాపారులే చెబుతున్నారు. గతంలో తాడేపల్లిగూడెం నుంచి వెస్ట్ బెంగాల్, బంగ్లాదేశ్‌లకు ఎగుమతి అయ్యేవి.. కానీ ఇప్పుడు వ్యాపారులు నేరుగా తాడేపల్లిగూడెంతో సంబంధం లేకుండా వెస్ట్‌బెంగాల్‌కు ఎగుమతి చేసేస్తున్నారు. ధర పెరగడానికి ఇది కూడా కారణంగా వ్యాపారులు చెబుతున్నారు.

- అల్లం ధర దిగివచ్చింది. గత సంవత్సరం ఇదే సమయానికి కిలో రూ.140 నుంచి 200లకు పలికింది. ప్రస్తుతం కిలో రూ.35కే లభిస్తుంది. దీనికి కారణం కొత్త ప్రాంతాల్లో అల్లం సాగుచేయడం వల్లే ధర తగ్గినట్టు వ్యాపారులు చెబుతున్నారు.
- పచ్చిమిర్చి ధర భారీగా పడిపోయింది. పది కిలోల మిర్చి హోల్‌సేల్‌గా రూ.200కే విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు గత వారంతో పోలిస్తే అన్నింటి ధరలు నిలకడగానే ఉన్నాయి. టమోటా ధర మాత్రం కిలోకు రూ.10 అదనంగా పెరిగి ప్రస్తుతం రూ.30 విక్రయిస్తున్నారు.

నిలకడగా కూరగాయల ధరలు



నిలకడగా నూనెల ధరలు

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం కిలోకి రూ.50 వరకూ తగ్గింది. సన్ ఫ్లవర్ లీటరు రూ.150కి, వేరుశెనగ డబుల్ ఫిల్టర్ రూ.160కి కాటన్ రూ.110కి విక్రయిస్తున్నారు. నాణ్యమైన కందిపొప్పు, కిలో రూ.120, మినపపప్పు రూ.90కి విక్రయాలు జరుగుతున్నాయి.

సాగు విస్తీర్ణం పెరగడంతో నిలకడగా ధరలు..



గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం పెరగడంతో కూరగాయల ధరలు నిలకడగా ఉన్నాయి. అల్లం, పచ్చిమిర్చి ధరలు తగ్గాయి. మిగిలిన కూరగాయల ధరలు గత వారం మాదిరిగానే యథావిధిగా ఉన్నాయి. ఉల్లిపాయల ధర మాత్రమే పెరిగింది. =మహారాష్ట్రలో కురిసిన వర్షాల వల్ల ఉల్లి దిగుమతి తగ్గి.. ధరలు పెరుగుతున్నాయి. మరింత ధర పెరిగే అవకాశం ఉంది.

- కె.గౌరీ శంకర్, కూరగాయల వ్యాపారి.


మట్లాడుతున్న అగ్రిగోల్డ్ సంఘ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలి

తణుకు, జూన్ 15(ఆంధ్రజ్యోతి):అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ హామీ మేరకు ఉన్నతాధికారులతో కమిటీలు నియమించి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు కోరారు. ఆదివారం తణుకు సురాజ్య భవనంలో అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు స్వాగతిస్తున్నామన్నారు. కాలయాపన లేకుండా కమిటీలు, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేపట్టాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సుమారు 22లక్షల మంది బాధితులు ఉన్నారని చెప్పారు. అనంతరం మహిళా నాయకులు నాగలక్ష్మి, రామశ్రీను, గోపాలకృష్ణ పలు బ్రాంచిల ప్రతినిధులు మాట్లాడారు. అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

చింతలపూడి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఏరియా ఆసుపత్రి వద్ద ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పెండింగ్ జీతాలు విడుదల చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఆసుపత్రి వద్ద బ్యానర్, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు గత నాలుగైదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, 15 నెలల ప్రావిడెంట్ ఫండ్ పెండింగ్‌లో ఉందని, వీటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే కార్మికులు సమ్మెలోకి వెళ్తారని హెచ్చరించారు.


ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నిరసన కార్యక్రమంలో ఏపీ మెడికల్ అండ్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షురాలు పి.మరియమ్మ, నాగరాజు, కుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కార్యదర్శి రత్నప్రసాద్.. పాల్గొన్న వృద్ధులు

వృద్ధులకు బాసటగా నిలవాలి : జడ్జి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు బాసటగా నిలవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ అన్నారు. ఆదివారం ఏలూరు ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో 'ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం' సందర్భంగా వృద్ధుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం ప్రత్యేకమైనదన్నారు. వృద్ధులపై వేధింపులు, నిర్లక్ష్యం, దుర్వినియోగం వంటి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించడానికి ఒక వేదికని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా వృద్ధుల పట్ల సమాజంలో మంచి అవగాహన, స్ఫూర్తి కలుగుతుందన్నారు. పిల్లలు వాళ్ల తల్లి దండ్రుల రక్షణ, పోషణ, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి రెవెన్యూ డివిజనల్ ఆఫీసులో ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాలను వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను, నేరుగా గాని లేదా 15100 లేదా 08812-224555 ద్వారా సంప్రదించాలని సూచించారు. న్యాయవాది రత్నప్రసాద్, ప్రేమాలయం నిర్వాహకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విరాళం పత్రాన్ని దాత కుటుంబానికి అందజేస్తున్న ఈవో మూర్తి

శ్రీవారి అన్నదాన ట్రస్టుకు రూ.1.85 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, జూన్15(ఆంధ్రజ్యోతి):శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత కుటుంబం ఆదివారం రూ.1.85లక్షలను విరాళంగా అందజేశారు. కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గుల్లా మంగరాజు, నాగమణి ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి, ఏఈవో పి.నటరాజారావు విరాళం పత్రాన్ని, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

రూ.39 వేలు నగదు, 11 సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌ల స్వాధీనం


జూదరులతో భీమడోలు సీఐ విల్సన్ బృందం

ద్వారకాతిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు భీమడోలు సీఐ యూజే విల్సన్ తెలిపారు. పంగిడిగూడెంలోని ఓ పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ టి.సుధీర్ తమ బృందంతో దాడులు చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.39వేలు నగదు, మూడు మోటారు సైకిళ్లను, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్టు గుర్తిస్తే ప్రజలు తెలియజేయాలని, నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, జూన్15(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన అబ్బూరి కృష్ణారావు(80)కు కుమార్తె, కుమారుడు ఉండగా వారికి వివాహం జరిపారు. భార్య కొద్ది కాలం క్రితం మరణించింది. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు జీవితంపై విరక్తి చెంది ఈనెల 11వ తేదీన విషపు గుళికలను మింగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఏలూరు క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : ఏకారణమో తెలియదు కాని ఒక వ్యక్తి పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. టి.నరసాపురానికి చెందిన నత్తా ఆశీర్వాదం(45)కు భార్య, పిల్లలు ఉన్నారు. ఈనెల 6వ తేదీన పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

- తలుపులు పగులగొట్టి 60 కాసుల బంగారు ఆభరణాల అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంటి తలుపులు పగులగొట్టి 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు తూర్పు వీధి జిల్లెళ్ళమూడి వారి వీధిలో కామాడ జాబిల్లి నివాసం ఉంటున్నారు. ఆమె బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. 12.30 గంటల సమయంలో స్కూల్ సిబ్బంది ప్రిన్సిపాల్ ఇంటికి వెళ్లగా అప్పుడు కూడా ఆ ఇంటి తలుపులు భద్రంగానే ఉన్నాయి. 12.30 నుంచి 2 గంటల మధ్యలో దక్షిణంవైపు ఉన్న తలుపులను పగులగొట్టి దొంగలు ఆ ఇంట్లోకి ప్రవేశించి మూడు బెడ్‌రూమ్స్‌లో ఉన్న 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. కొంత నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఎస్ఐలు నాగబాబు, మదీనాబాషా, వారి సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు క్లూస్ టీమ్, వేలిముద్ర నిపుణులు, పోలీసు జాగిలాలను ఘటనా స్థలానికి రప్పించి పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించడానికి అన్ని కోణాల్లో పరిశీలన చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్, సీఐ సత్యనారాయణ

అదృశ్యమైన బాలికల కేసు ఛేదించిన పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఇద్దరు బాలికలను 24 గంటలలోపే గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పగించిన తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అభినందించారు. తాడేపల్లిగూడెం మండలంలో ఓ గ్రామానికి చెందిన తల్లి తన కుమార్తెతో పాటు ఇంటి ఎదురుగా ఉండే మరో బాలిక ఈనెల 12 నుంచి కనిపించడం లేదని 13వ తేదీన రూరల్ పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు. డీఎస్పీ శ్రీనాథ్ పర్యవేక్షణలో ఈకేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సీఐలు రమేష్, ఆది ప్రసాద్, ఎస్ఐలు జేవీఎన్ ప్రసాద్, కేసీహెచ్ స్వామిలతో ప్రత్యేక బృం దాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ ఫుటేజీ, బాలికల ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేసి వారు చెన్నైలో ఉన్నట్టు గుర్తిం చారు. ఆ బాలికలు స్నాప్‌చాట్‌లో బాయ్ ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేస్తూ చెన్నైలో పనిచేసు కుంటూ పెళ్లి చేసుకోవాలని భావించినట్టు దర్యాప్తులో తేలినట్టు పోలీసులు వివరించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన తాడేపల్లిగూడెం పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

హైదరాబాద్‌లో పెన్నాడ యువకుడి మృతి


శ్రీకాంత్(ఫైల్)

పాలకోడేరు/హైదర్‌నగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి వివాహానికి హాజరై తిరిగి వెళ్తుండగా హైదరాబాద్ కూకట్‌పల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన ఆదాడ శ్రీకాంత్(28) మృతి చెందాడు. కేపీహెచ్‌బీ ఎస్ఐ రూప, స్థానికులు తెలిపిన వివరాలివి.. పెన్నాడ గ్రామానికి చెందిన ఆదాడ అప్పన్నకు ఏకైక కుమారుడైన శ్రీకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి బీహెచ్‌ఈఎల్‌లో స్నేహితుడి వివాహానికి హాజరయ్యాడు. తిరిగి కూకట్‌పల్లిలోని తన బ్యాగులు తీసుకెళ్లేందుకు వచ్చి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఓ బైక్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహం గ్రామానికి సోమవారం చేరుకుంటుందని స్థానికులు తెలిపారు. శ్రీకాంత్ పుట్టినరోజు ఇదే నెల చివరి వారంలో ఉందని, ఈలోగా ఈఘోరం జరిగిందని కుటుంబసభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

దువ్వలో కొడవలితో దాడి..

- ఒకరికి గాయాలు.. కేసు నమోదు

తణుకు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పొలం తగాదాల కారణంగా ఏర్పడిన పాత కక్షలతో ఒక వ్యక్తిపై కొడవలితో ఇద్దరు దాడి చేసి గాయపర్చిన ఘటన తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాలవి.. దువ్వ గ్రామానికి చెందిన మైపాల నాగేశ్వరరావు ఆదివారం తన పొలంలో పని చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కైకాల వినాయక్, కైకాల రమేష్ కొడవలితో దాడి చేసి నాగేశ్వరరావుపై కొడవలితో చేతులపై నరికారు. గాయపడిన అతడిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


ఢీకొట్టిన కారు

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఆకివీడు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా కారు నడుపుతూ జాతీయ రహదారిపై వెళుతున్న ముగ్గురిని వేగంగా వెనుక నుంచి ఢీకొన్న ఘటన ఆదివారం ఆకివీడులో జరిగింది. స్థానిక అయి-భీమవరం రోడ్ నుంచి జడ్పీ బాలురు ఉన్నత పాఠశాల వైపు హైవేపై నడుచుకుంటూ వెళుతున్న దేవవరపు నాగసావిత్రి, జిక్కంపూడి ఫణికుమారిలతో పాటు బైక్‌పై వెళుతున్న టి.దుర్గారావును వెనుక నుంచి ఆకుల శివ అనే వ్యక్తి నిర్లక్ష్యంగా కారు నడిపి ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆ ముగ్గురు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

కొల్లేరు ప్రజల జీవనాన్ని కాపాడాలి: సీపీఎం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రాంతాల్లో పక్షులు, పర్యావరణాన్ని కాకుండా అక్కడి ప్రజల జీవనాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్విరాన్‌మెంట్ కమిటీకి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొల్లేరు ప్రజల జీవితాలను, జీవనాన్ని కాపాడాలని ఈ నెల 17,18 తేదీల్లో పర్యటించే సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ కమిటీని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ కోరిందన్నారు. కొల్లేరును నమ్ముకుని జీవిస్తున్న వందలాది కుటుం బాల జీవితాలు రోడ్డున పడకుండా కాపాడాలన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు జంపన వెంకట రమణరాజు మాట్లాడుతూ ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ నాయకులు సంజీవ్, మేరీ, చంద్రకళ, జె.దుర్గారావు, పి.శ్రీను పాల్గొన్నారు.

వేతనాలు జమ కాలేదంటూ అంగన్‌వాడీల ఆందోళన

ఏలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలకు మే నెలాఖరైనా వేతనాలు జమకాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నెలలో సగం రోజులు గడుస్తున్నా ఇంకా వేతనం జమ కాలేదు. ప్రతీ నెల వారి పనిచేసిన పనిదినాలకు సంబంధించి సీడీపీవోల ద్వారా వచ్చిన డేటాను అప్‌డేట్ చేసి ప్రతి నెలా 27వ తేదీలోగా ఐసీడీఎస్ పీడీ లాగిన్ ద్వారా ట్రెజరీకి బిల్లులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. జీవో 15 ప్రకారం సీఎఫ్ఎంఎస్(కాంప్రెహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) కింద నిర్దేశిత సమయానికి లాగిన్ కావాల్సి ఉందని, సాంకేతిక కారణాలతో ఆగిపోయినట్టు చెబుతున్నారు. వేతనాల విషయంపై ఐసీడీఎస్ పీడీ పి.శారదను వివరణ కోరగా, ట్రెజరీలో బిల్లుల నమోదు కాలేదని, దీనిపై ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించామని, ఈ నెల 20 నుంచి 25వ తేదీలోగా అంగన్‌వాడీలకు వేతనాలు జమ పడే అవకాశం ఉందన్నారు. నెలాఖ రునాటికి జూన్ వేతనం జమవుతుందని, అధైర్యపడాల్సిన పని లేదన్నారు.

చింతలపూడి మహాసభలను జయప్రదం చేయండి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలో జూలై 5, 6, 7 తేదీల్లో జరగనున్న సీపీఐ ద్వితీయ మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావులు ఆదివారం పిలుపునిచ్చారు. 18న ఏలూరులో సీపీఐ చేపట్టిన ప్రసార కార్యక్రమంలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. శత వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సమయంలో సీపీఐ ఏలూరు జిల్లా ద్వితీయ మహాసభలను చింతలపూడిలో జరుపుకుంటున్నామన్నారు. 18న అన్ని మండలాల్లో, పట్టణాల్లో బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): 1981-82 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పెదపాడు హైస్కూల్లో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 44 సంవత్సరాల క్రితం టెన్త్ చదివి ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ వృత్తుల్లో దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి సందడి చేశారు. అనంతరం అంతా కలిసి భోజనాలు చేసి జ్ఞాపికలను అందజేసుకున్నారు. పూర్వ విద్యార్థి కట్నేని సుబ్రహ్మణ్యం 60వ పుట్టిన రోజు, ఫాదర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. 1981-82 సంవత్సరం పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన

ఏలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబా ఉత్కర్ష్ అభియాన్ పథకంలో భాగంగా ఏలూరు జిల్లాలోని 86 కొండరెడ్డి గ్రామాల్లో, 46 గిరిజన గ్రామాల్లో ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు గ్రామ సభలను నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో రాములు నాయక్ తెలిపారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, పోలవరం, కుక్కునూరు, టి.నర్సాపురం, చింతలపూడి, నూజివీడు, చాట్రాయి మండలాల్లో గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు. ఈ సభల్లో అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొంటారని తెలిపారు. గ్రామసభల్లో ప్రతీ ఒక్కరికీ ఆధార్, కులధృవీకరణ, రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు తదితర పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. భక్తులు అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

126 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



ఏలూరు కార్పొరేషన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నాయకులు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రామకోటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ఉషాపిక్చర్స్ అధినేత బాలకృష్ణారావు సహకారంతో 126 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి నేత్రాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 15 మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి శస్త్ర చికిత్స నిర్వహించేందుకు వేమగిరికి తీసుకెళ్లారు. ఒక వినికిడి యంత్రాన్ని వెంకటేశ్వరరావు అనే వృద్ధుడికి అందజేశారు. మానవత డెవలప్‌మెంట్ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, స్థానికులు పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్, అజయ్ కుమార్‌లు శిబిరంలో సేవలందించారు.

కొల్లేరు సమస్యలు కోకొల్లలు

(5వ పేజీ తరువాయి)

పరిరక్షణ కోరుతూ కొందరు ఏదొక రూపంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ వస్తున్నారు. గతంలో కొల్లేరు ప్రక్షాళనకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణప్రియులు డిమాండ్ మేరకే కొల్లేరు ఆపరేషన్‌కు దారితీసింది.

సాధికార కమిటీపైనే అందరి చూపు : కొల్లేరు పరిస్థితిని అధ్యయనం చేయడానికి మరోమారు కేంద్ర సాధికార కమిటీ రెండురోజుల పాటు కొల్లేరు ప్రాంతంలో పర్యటించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అనంతరం ఈ బృందం మంగళ, బుధవారాల్లో కొల్లేరు క్షేత్రస్థాయిలో పర్యటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొల్లేరు ప్రాంతంలో ప్రజలెదుర్కొంటున్న కష్టాలపై ఎమ్మెల్యే లు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా ఈ నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పుడు సాధికార కమిటీ నేరుగా కొల్లేరులో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానికులంతా తాము ఎదుర్కొంటున్న కష్టాలు, జీవనోపాధిలో ఎదురవుతున్న ఆటంకాలు, కాంటూరు కుదింపు వ్యవహారం పూర్తిగా కమిటి దృష్టికి తీసుకెళ్లేందుకు సమాయత్తం అయ్యారు. జిరాయితీ భూములు ఇప్పటికే దాదాపుగా 22వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు పేర్కొంటూనే కొల్లేరు ప్రాంతంలో పాఠశాలలు, నివాసిత ప్రాంతాలు, తాగునీటి చెరువులు, ఇతరత్రా వాటిని మినహాయించాలన్న డిమాండ్‌ను లేవనెత్తబోతున్నారు. ఇప్పటికే కొంతమంది విద్యావంతులు సాధికార కమిటికి అర్థం అయ్యేలా వినతులు సిద్ధం చేశారు. ఈసారి కమిటి సమర్పించే నివేదిక అత్యంత కీలకం కావడంతో ఒకింత జాగ్రత్తగా మెలగాలని కూడా కొల్లేరువాసులు ఒక నిర్ణయానికి వచ్చేశారు. సాధికార కమిటి పర్యటన పూర్తి వివరాలు జిల్లా యంత్రాంగం వెల్లడించాల్సి ఉంది.

కొందరు విద్యార్థులకు జాప్యం

(5వ పేజీ తరువాయి)

అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడకపోవడానికి ప్రధాన కారణం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాల సొమ్ములు జమవుతాయి. పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ఖాతా తెరిస్తే నగదు జమవుతుందని తెలుస్తోంది.

ఆందోళన చెందాల్సిన పనిలేదు : సోషల్ వెల్ఫేర్ ఈడీ ముక్కంటి

ఇంటర్, 9,10 తరగతిలో విద్యార్థులకు తల్లికి వందనం పడలేదు. నిధులు జమ కాని తల్లులు పోస్టాఫీస్‌లో ఖాతా తెరవాలి. ఇందుకోసం తమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. మరో రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం విద్యార్థులందరికీ జమచేసేందుకు చర్యలు చేపట్టాం.

వారం రోజుల పాటు చిరు పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు వారం రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామని ఏలూరు నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు శానం శ్రీరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకులు నారాశేషు పాల్గొని ఆగస్టు 15 నుంచి 22వ తేదీ వరకు జరిగే కార్యక్రమాల వాల్ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. మొక్కలు నాటడం, రక్తదానం, మహిళలకు సత్కారం నిర్వహిస్తామన్నారు. అఖిల భారత చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు రమణం స్వామి నాయుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

లింకు రోడ్లకు మోక్షం కల్పించండి..

రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాలంటూ విజ్ఞప్తి

లింగపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగపాలెం నుంచి పలు గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లన్నీ గుంతలుపడి, కంకరరాళ్లు పైకితేలి దయనీయంగా మారాయి. లింక్ రోడ్లన్నీ గుంతలుపడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రోడ్ల మీదుగా రైతులు పంట ఉత్పత్తులను మండల కేంద్రానికి తీసుకురావాలన్నా, విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా నరకంగా మారుతోంది. ఈ లింకు రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం రోడ్ల సమస్యను పట్టించుకోలేదని, టీడీపీ ప్రభుత్వమైనా ఈ రోడ్లకు మోక్షం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కంకరలేచి అధ్వానంగా ఉన్న రోడ్డు

గుంతలతో రోడ్లు అధ్వానం.. బాగుచేయండి : ప్రభాకరరావు, కొణిజర్ల



గత ప్రభుత్వంలో లింక్‌రోడ్లను పట్టించుకోక పోవడంతో రోడ్లన్నీ రాళ్లుతేలి గుంతలతో అధ్వానంగా మారాయి.. పంట ఉత్పత్తులు వాహనాలపై తరలించాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రోడ్లు సరిగా లేక పోవడంతో బస్సు సౌకర్యం కూడా లేదు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే అంతే సంగతులు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ సహకారంతో మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు బాగుపడుతున్నాయి. అలాగే గ్రామాల్లో లింక్ రోడ్లకు కూడా మోక్షం కల్పిస్తే బాగుంటుంది.

లింక్‌రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం



అన్ని గ్రామాలను కలిపే లింక్‌రోడ్లకు మరమ్మతులకు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పూర్తిగా పాడైన లింక్ రోడ్లను త్వరగా మరమ్మతులు చేసేలా అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. త్వరలోనే ఈ రోడ్లన్నీ మరమ్మతులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

కె.జగన్నాథరావు, పి.ఆర్. ఏఈ, లింగపాలెం

వెంకటేశ్వరలో నేటి నుంచి అడ్మిషన్లు

» ఎట్టకేలకు అంగీకరించిన యాజమాన్యం



జూనియర్ కళాశాల భవనం

కామవరపుకోట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపల్ చల్లా వేణు గోపాల్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు తీసుకుంటామని చెప్పారు. ఈ కళాశాలలో ఫస్ట్ ఇయర్ అడ్మిషన్ల విషయంలో గత మూడు నెలలుగా సందిగ్ధత నెలకొంది. యాజమాన్యం అనుమతివ్వకపోవడంతో చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ చొరవ తీసుకుని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఎంపీ మహేశ్ కుమార్, జిల్లా మంత్రి కొలుసుపార్థసారథి, కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్లారు. ఇటీవల జిల్లాలో జరిగిన డీఆర్సీ సమావేశంలో మంత్రి సారథి ఈ కళాశాల అంశాన్ని లేవనెత్తి తక్షణమే అక్కడ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి తక్షణమే అడ్మిషన్లు తీసుకోవాలని, కళాశాల అభివృద్ధితో పాటు ఫ్యాకల్టీపరంగా ఏ సాయమైనా ప్రభుత్వ పరంగా చేయిస్తామని హామీ ఇచ్చారు.దీంతో ఎట్టకేలకు దేవస్థానం ట్రస్టు బోర్డు ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు తీసుకోవడానికి నిర్ణయం తీసుకోవడంతో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తీసుకున్న చొరవతోనే ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్టు బోర్డు కమిటీ కళాశాల నడిపేందుకు అంగీకరించడం ఆనందంగా ఉందని టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ పేర్కొన్నారు.

గమయ బ్రాంచ్ ప్రారంభం



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ పేట, వెంకటేశ్వరస్వామి వారి గుడి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయవాడ గమయ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ నూతన బ్రాంచ్‌ను ఆదివారం ఉదయం ఆశ్రం మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఎం.మహేష్‌కుమార్, గైనకాలజిస్ట్, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ కె.వందన, శ్రీకృష్ణ మదర్, చైల్డ్ హాస్పిటల్ సీనియర్ వైద్యులు జి.రవీంద్రనాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు నోరి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చిన్నారుల్లో ఎక్కువగా ప్రబలుతున్న ఆటిజం, హైపర్ యాక్టివిటీ కండిషన్స్‌లకు సంబంధించిన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గమయ సెంటర్ డైరెక్టర్ సీనియర్ గైనకాలజిస్ట్ నోరి అనూరాధ మాట్లాడుతూ ఇప్పటి వరకు విజయవాడ గమయ ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ, విదేశాల్లో ఎంతో మంది పిల్లలకు సేవలందించామన్నారు. ఇప్పుడు ఏలూరులో ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈ సేవలను ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని తల్లిదండ్రులు తమ పిల్లలకు వినియోగించుకోవాలని కోరారు. వైద్యులు రమేశ్, పృథ్వీ నరేశ్, బిందు చౌదరి, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, నిబద్ధత టీడీపీ ప్రాథమిక సూత్రమని, ప్రతి కార్యకర్త దీనికి కట్టుబడి పని చేయాలని, అప్పుడే పార్టీలో సముచిత స్థానం, గౌరవం దక్కుతాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. కొన్నిచోట్ల నాయకుల మధ్య అంతరాలను గుర్తించిన ఆయన వారికి హితబోధ చేశారు. ఎవ్వరికివారు బాధ్యతాయుతంగా ఉంటూ మన దగ్గరకు వచ్చే వారికి సాయం చేయడానికి సహకరించాలని ఆయన సూచించారు.

గంగానమ్మకు పూజలు : పినకడిమిలో ఆదివారం నిర్వహించిన శ్రీగంగానమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల జాతరలు గ్రామాలను సుభిక్షంగా ఉంచుతాయన్నారు. దైవభక్తి ప్రజలను సన్మార్గంలో నడిపిస్తుందని పేర్కొన్నారు.

● పెదపాడు: రాజకీయ నాయకుడు చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. టీడీపీ నాయకులు, కొణికి మాజీ సర్పంచ్ గంపా రాంబ్రహ్మం విగ్రహాన్ని కుమారుడు గంపా వంశీ, కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొణికి గ్రామంలో ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదివారం ఆవిష్కరించారు. మోరు శ్రావణి, ఉప్పలపాటి రాంప్రసాద్, గుత్తా అనిల్, మరడాని రవి, పొట్లూరి యుగంధర్, అక్కినేని వంశీకృష్ణ, లావేటి శ్రీనివాసరావు, కలిపిండి అప్పారావు, రంభా నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం

జంగారెడ్డిగూడెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో హైదరాబాద్‌కు చెందిన బలిసట్ల చలమయ్య దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్ దంపతులు కల్యాణ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈవో మానికల రాంబాబు,ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు రామకుమార్ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ఒకే కుటుంబంలో నలుగురికి తల్లికి వందనం

పెదవేగి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం పేదల జీవితాల్లో ఆనందాన్ని నింపుతోంది. పథకం సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమవడంతో ఆయా కుటుంబాలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నాయి. పెదవేగికి చెందిన నక్కా వెంకన్న, కోటమ్మలకు నలుగురు పిల్లలు. కుమార్తె దీవెన, పెద్ద కుమారుడు పెద్దిరాజు ఐదవ తరగతి, మూడో కుమారుడు దుర్గారావు 4వ తరగతి, చిన్న కుమారుడు రాజ్‌కుమార్ 2వ తరగతి స్థానిక మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. యాచక వృత్తితో జీవనం సాగించే ఈ కుటుంబాల్లో చైతన్యం తీసుకొచ్చి, పిల్లలను చదివించేలా ప్రోత్సహించడంతో వారంతా పాఠశాలలకు వెళ్తున్నారు. ఇప్పుడు తల్లికి వందనం పథకంలో భాగంగా ఆ నలుగురు పిల్లలకు రూ.52 వేలు అందడంతో ఆ కుటుంబం సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇంటింటికి వెళ్లి భిక్షమెత్తుకునే వారమని, గ్రామ పెద్దలు తమ పిల్లలను బడిలో చేర్పించారని అన్నారు. చింతమనేని చొరవతో తమకు పథకం వర్తించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వెంకన్న, కోటమ్మలతో నలుగురు పిల్లలు

బాబు చెప్పేవన్నీ అసత్యాలే : వైసీపీ

ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ఏడాది పాలన మొత్తం మోసమేనని, ప్రజలను నిలువునా మోసం చేసి ఏ ఒక్క పథకమూ అమలు చేయకుండా అన్నీ చేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని వైసీపీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పథకం అమలు చేస్తామని, ఆడపడుచులను మోసం చేశారని, ఏడాది గడిచిన తరువాత ఇప్పుడు ఈ పథకాన్ని అమలు చేసినా గతంలో 87 లక్షల మంది లబ్ధిదారులుంటే వారిలో 20 లోల మందిని తొలగించడం దారుణమన్నారు.ఎం.జయప్రకాష్, పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న అసోసియేషన్

సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ఐక్యంగా పోరాడదామని ఏలూరు జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన రాంబాబు పదవీ విమరణ చేయడంతో ఆ స్థానంలో ఏలూరు డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న సాయిల వెంకటేశ్వరరావును ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా రాంబాబును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. వీఆర్వో గ్రేడ్ వన్, గ్రేడ్ 2లు అంతా ఐక్యంగా ఉండాలని, సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఎస్వీ సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్కే అక్బర్, నూజివీడు, జంగారెడ్డిగూడెం అధ్యక్షులు శ్రీనివాసరావు, అడపా రాంబాబు, సభ్యులు పుట్ట అజయ్‌బాబు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా గన్ని పుట్టిన రోజు వేడుకలు

భీమడోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకుల నడుమ ఘనంగా జరిగాయి. భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల తదితర గ్రామాల్లో కార్యకర్తలు గన్నికి శుభాకాంక్షలు తెలుపుతూ కేకులు కట్ చేసి మిఠాయిలు పంచారు. పూళ్లలో టీడీపీ నేత పుప్పాల హరీష్ ఆధ్వర్యంలో గన్ని పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుల్లయ్యనాయుడు, కరుటూరి ప్రసాద్, గంధం లక్ష్మణ్ పాల్గొన్నారు. ఇదిలా ఉంటే గన్ని వీరాంజనేయులు వ్యక్తిగత కారణాలతో వేడుకలకు దూరంగా ఉన్నారు.

అనాథాశ్రమంలో అన్న సమారాధన..

ఉంగుటూరు: అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం ఉంగుటూరు అనూరాధ అనాథాశ్రమంలో అన్న సమారాధన నిర్వహించారు.తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి చందు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు

ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి):చాటపర్రు సెక్షన్, గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం సోమ, మంగళవారాల్లో రెండ్రోజులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. కొక్కిరాయలంక, పైడిచింతప్పాడు, ఏరియా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం అంబేద్కర్ తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం

పెదపాడు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వడ్డిగూడెంలో తనిఖీలు నిర్వహించి చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను ఐషర్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారదాసతీశ్ తెలిపారు. వాహనంలోని సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని వాహన యజమాని, డ్రైవర్‌పై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్టు ఎస్.ఐ. సతీశ్ తెలిపారు.



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

గిరిజనులకు మెరుగైన సేవలందించాలి

బుట్టాయగూడెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు దాతలకు సూచించారు. బుట్టాయగూడెం జడ్పీ హైస్కూల్లో ఆదివారం జంగారెడ్డిగూడెం క్షత్రియ సేవా సంఘం, ఏలూరు ఆశ్రం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, కరాటం వెంకట రెడ్డినాయుడు, కరాటం సాయిబాబా, క్షత్రియ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో నారాయణపురం వంతెన



దెబ్బతిన్న వంతెన

ఉంగుటూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం హైవేను కలిపే వంతెన ఆదివారం తెల్లవారు జామున కుంగింది. హైవే వైపు వెళ్లే రహదారిలో ఎడమ పక్కన అంచు విడిపోయి కుంగిపోవడంతో నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుబాష్ నేతృత్వంలో చేబ్రోలు, గణపరం, నిడమర్రు పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాల్వగట్టు పక్కన తొలగించిన శిథిలాలను వంతెనకు అడ్డం పెట్టి వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతిస్తున్నారు.



తల్లికి వందనం లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తల్లికి వందనం వాగ్దానం నెరవేర్చాం

ఏలూరుటూటౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తల్లికివందనం లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు అందిస్తున్నామన్నారు.

డీపీటీవోగా షేక్ షబ్నం

ఏలూరు క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారిగా షేక్ షబ్నంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న షబ్నంకు పదోన్నతి కల్పించి డీపీటీవోగా ఏలూరు జిల్లాకు నియమించారు. దీంతో సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకూ భీమవరం జిల్లా డీపీటీవో వర ప్రసాద్, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి డీపీటీవోగా విధులను నిర్వర్తిస్తున్నారు. ఆయన నుంచి ఉద్యోగ బాధ్యతలను షబ్నం చేపట్టనున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

లింగపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తమ వాహనాలపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్ఐ రాంబాబు అన్నారు. మండలంలోని లింగపాలెంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలివ్వకూడదని సూచించారు.



ఏలూరులో డ్రంకెన్ డ్రైవ్

ఏలూరు క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్ వారి సిబ్బంది కలిసి ఆదివారం ఏలూరు మున్సిపల్ ఆఫీస్ సమీపంలో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్లతో వాహనదారులను తనిఖీలు చేశారు. అతి వేగం ప్రమాదకరమని వాహనదారులు పరిమితికి మించి వేగం వెళ్లకూడదని, ఆటోలలో పరిమితికి మించి ఎక్కించుకోకూడదని సూచించారు.

ప్రతిరైతు ఈకేవైసీ చేయించాలి

లింగపాలెం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్నదాతా సుఖీభవ పథకం అందుకోవాలంటే తప్పనిసరిగా తమదగ్గరలోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే అర్హత ఉన్న ప్రతిరైతు రైతు సేవా కేంద్రాల్లో వేలిముద్ర వేసి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల కోసం సమాచారం అందుబాటులో ఉంచామన్నారు.

వైసీపీ నగర ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు



ఏలూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శిగా కుప్పాల ఆంజనేయులును నియమిస్తూ ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ ఉత్తర్వులిచ్చారు. నాయకులు గుడుదేశి శ్రీనివాసరావు, నేరుసు చిరంజీవి, గూడిపూడి కిరణ్, గండికోట అప్పారావు, కర్నాటి జయరాం, కుప్పాల రాంబాబు, కగ్గా వరప్రసాద్, తాడిపట్టి రాంబాబు, కుప్పాల గిరీష్, నక్క దినేష్, జి.దుర్గారావు పాల్గొన్నారు.

సంక్షేమంతో పెరిగిన అభిమానం

భీమడోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి) :తల్లికి వందనం పథకం అమలుతో కూటమి ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని దక్కించుకుందని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ప్రత్తి మదన్ అన్నారు. భీమడోలులో జనసేన పార్టీ సమావేశం ఆదివారం జరిగింది. మదన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గణపతి, సునీల్, నర్సింహమూర్తి, అజయ్, బద్రి వెంకటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

పోలాసిగూడెంలో టీడీపీ పర్యటన

కామవరపుకోట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా నియమితులైన ఏలూరి హరిరామకృష్ణ శనివారం రాత్రి అనుచర బృందంతో పోలాసిగూడెంలో పర్యటించారు. ఆ గ్రామంలోని ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేశారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని హరిరామకృష్ణ స్పష్టం చేశారు. నాయకులు కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపు సూర్యనారాయణ, ఆర్.సురేష్, కె.నరేంద్రరెడ్డి, ఎద్రు శ్రీనివాసరావు, సిరిగిన శ్రీనివాసరావు, బి.వెంకట్రావు, ఆర్.భాస్కరరావు, పి.సురేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

టి.నర్సాపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరేళ్ల జ్యోతి సుధాకర్ కృష్ణ తెలిపారు. మోదీ 11 ఏళ్ల సుపరిపాలనపై మధ్యాహ్నపువారిగూడెంలో మండలాధ్యక్షులు రామిశెట్టి సాయివిశ్వనాథ్ అధ్యక్షతన అభినందన సభ ఆదివారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జట్ల రాంబాబు, నాగార్జున, వెంకట్రావు, కేశవరావు, రవీంద్ర, వీరభద్రం, వినయ్, హరిబాబు, పూర్ణశేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు లైసెన్స్ మంజూరుకు వేలం

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు వాహన పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే లైసెన్స్ హక్కు పొందేందుకు ఈ నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఏసీ గంగా శ్రీదేవి తెలిపారు. మరిన్ని వివరాలకు 08674-234591 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు చాట్రాయిలో బీజేపీ సంకల్ప సభ

చాట్రాయి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో సోమవారం జరిగే బీజేపీ వికసిత్ భారత్ సంకల్ప సభకు మండలంలో అన్ని గ్రామాల నుంచి బీజేపీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం చాట్రాయిలో సీనియర్ నాయకుడు గడ్డం సంజీవరెడ్డి ఇంటి వద్ద మండల బీజేపీ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు ఓబిళ్ళనేని రాజా అధ్యక్షతన జరిగింది. సభకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ కిషోర్, జిల్లా నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ముత్తారెడ్డి, బుర్రి శ్రీకర్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



పోల్‌రాజ్ కెనాల్‌కు చేరిన కృష్ణాజలాలు

కైకలూరు చేరిన కృష్ణాజలాలు

ముందస్తుగానే కాల్వలకు నీటి విడుదలపై రైతుల హర్షం

కైకలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్ 15వ తేదీ నాటికి కృష్ణాడెల్టా శివారు ప్రాంతమైన కైకలూరు నియోజకవర్గానికి సాగునీరును ప్రభుత్వం విడుదల చేసింది. ఆదివారం కైకలూరు మండలం వింజరంలోని పోల్‌రాజ్ కెనాల్‌కు కృష్ణాజలాలు చేరాయి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు కృష్ణమ్మకు పసుపు కుంకుమ, హారతులు పట్టి స్వాగతం పలికారు. ముందుగానే సాగునీరు అందించడంతో ఆయా ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్ 15 నాటికి నీటిని విడుదల చేయడం పట్ల కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక వైపు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పంటకాలువల తవ్వకాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడా నీటి ప్రవాహానికి అవరోధాలు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో శివారు ప్రాంతానికి త్వరితగతిన నీరు చేరి తాగునీటి ఇబ్బందులు కూడా తీరతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేసిన మంత్రి



చాట్రాయి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నందమూరి శ్రీనుకు మంత్రి కొలుసు పార్థసారధి శనివారం రాత్రి నూజివీడు కార్యాలయంలో బ్యాటరీ ట్రై సైకిల్ అందజేశారు. మే 15న చాట్రాయిలో జరిగిన ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడు శ్రీను మంత్రికి వినతిపత్రం సమర్పించగా, స్పందించి మంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, నాయకుడు కలకొండ భాస్కరరావు పాల్గొన్నారు.



మేడా రాకేష్‌కు ఏకలవ్య ప్రతిభ అవార్డు

చాట్రాయి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఎస్టీ కాలనీకి చెందిన టెన్త్ టాపర్ మేడా రాకేష్ విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏకలవ్య ప్రతిభ అవార్డు-2025 అందుకున్నాడు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా రాకేష్‌కు రూ. 10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌లో చదివిన రాకేష్ టెన్త్‌లో 558 మార్కులు సాధించాడు. ఏకలవ్య ట్రైబల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేస్తున్నారు. అవార్డు అందుకున్న రాకేష్‌ను కోటపాడు మాజీ ఎంపీటీసీ మాధవి, సీకే పాడు నీటి సంఘం అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

దివ్యాంగురాలికి 'మేము సైతం' చేయూత



ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పూర్తి అంగ వైకల్యంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ముదినేపల్లి అంబేడ్కర్ కాలనీకి చెందిన గోన మాధవి (30)కి స్థానిక 'మేము సైతం' టీమ్ సభ్యులు బాసటగా నిలిచారు. తల్లి పోషణలో ఉండి ప్రభుత్వ పెన్షన్ కూడా పొందలేకపోతున్న మాధవికి ఆదివారం మేము సైతం టీం, ఆదర్శ దళిత సంఘం తరపున నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, దాకరం సర్పంచ్ జాస్తి రాజా, మొవ్వ ఫణీంద్ర, భూపతి రవీంద్ర, దాసరి కృష్ణారావు, బాపట్ల సుధీర్, పోగోలు విజయసాగర్, పరిసిపోగు ప్రసాద్, హైకోర్టు అడ్వొకేట్ గుడిపూడి ఇస్రాయేలు తదితరులు సుమారు రూ. 7 వేలు విలువైన బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

పెన్షన్ మంజూరు చేయాలి..

నూరుశాతం వైకల్యం కలిగిన గోన మాధవికి పెన్షన్ మంజూరు చేయాలని నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, జాస్తి రాజా, మొవ్వ ఫణీంద్ర కోరారు. సదరం సర్టిఫికెట్ ఇవ్వడంలో కూడా వైద్యులు జాప్యం చేస్తున్నారని పేర్కొంటూ కలెక్టర్ ప్రత్యేకంగా దివ్యాంగురాలు మాధవికి వికలాంగ పెన్షన్‌ను మంజూరు చేయాలని కోరారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యం



టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

కలిదిండి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కోరుకొల్లులో కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేసి మాట్లాడుతూ సభ్యత్వం పొందిన వారందరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కోరుకొల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బుసనబోయిన సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం కింద మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందించామన్నారు. రూ.100 చెల్లించి టీడీపీ సభ్యత్వం తీసుకున్నందుకుగాను రూ.5 లక్షల ప్రమాద బీమా పరిహారం మంజూరయిందన్నారు. మాజీ ఎంపీపీ వలవల వెంకట రామారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు చెన్నంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు భోగేశ్వరరావు, సింహాచలం, రాజేష్, బోసు తదితరులు పాల్గొన్నారు. కలిదిండిలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు అస్లాం కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



రక్షిత నీటి పథకం వద్ద పైపులు పగిలి లీకవుతున్న నీరు

పగిలిన నీటి పథకం పైపులు..
రోడ్డు పైకే తాగు నీరు

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లిలో రక్షిత మంచినీటి పథకం పైపులు పగిలి నీరు లీకవుతోంది. ఓవర్ హెడ్ ట్యాంక్ వద్ద భూమిలో వేసిన పైపులు పగిలి నెలల తరబడి నీరు లీక్ అవుతున్నా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. లీక్ అవుతున్న నీటితో ఆ ప్రదేశమంతా మురుగుమయమైంది. పగిలిన పైపుల స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను గ్రామస్థులు కోరుతున్నా ఫలితం లేదు. లీకయిన నీరు మురుగు నీటిలో కలిసి తిరిగి ఆ నీరే పైపుల ద్వారా కుళాయిలకు వచ్చే ప్రమాదం ఉందని, అధికారులు పగిలిన పైపుల స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డీగ్రేడైన యూపీ స్కూళ్ల కొనసాగింపు?

విద్యాశాఖ ఉన్నతాధికారుల సమీక్ష
ఆంధ్రజ్యోతి కథనాలపై స్పందన

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో ముదినేపల్లి మండలంలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా డీగ్రేడ్ అయిన మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలను యథాతథంగా కొనసాగించే అంశాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మండలంలో 9 యూపీ పాఠశాలలు డీగ్రేడ్ కాగా, వాటిలో విద్యార్థులకు మరింత ఇబ్బందికరంగా ఉన్న ఐదు యూపీ పాఠశాలలను కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండలంలో యూపీ పాఠశాలలన్నీ బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారి 6, 7, 8 తరగతులు రద్దు కావటం, ఆయా పాఠశాలల విద్యార్థులు చాలా దూరంలోని జడ్పీ హైస్కూళ్లకు వెళ్లి చదువుకోవటంలో ఎదురయ్యే ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరుస కథనాలకు స్పందించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు మండల విద్యాశాఖాధికారి నుంచి నివేదిక సేకరించారు. దీనిపై ఇటీవల మంగళగిరిలోని విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ సుబ్బారెడ్డి సమీక్షించారు. యూపీ స్కూళ్లు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మారటం వల్ల విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులను ఆయన గుర్తించినట్లు తెలిసింది. దీంతో ప్రస్తుతం యూపీ పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, వారు వెళ్లాల్సిన హైస్కూళ్ల దూరాన్ని బట్టి ఐదు యూపీ పాఠశాలలను కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దాకరం, కోడూరు, చినకామనపూడి, వణుదుర్రు, కొరగుంటపాలెం యూపీ పాఠశాలలు యథాతథంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



వణుదుర్రు యూపీ పాఠశాల



చాట్రాయికి చెందిన దునుకు శివశంకరరావు కుటుంబం



ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన జితేంద్ర కుటుంబం

పిల్లల్ని బాగా చదివిస్తాం..

▸కూటమికి కృతజ్ఞతలు ▸తల్లికి వందనం లబ్ధిదారుల ఆనందం

చాట్రాయి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చాట్రాయికి చెందిన దునుకు శివ శంకరరావు, ఉమా మహేశ్వరి దంపతుల పిల్లలు లక్ష్మీ సోమయ్య, నాగ ప్రకాష్, హేమ నందిని లకు తల్లికి వందనం పథకం కింద రూ. 39 వేలు పోస్టాఫీస్ ఖాతాకు జమ కావటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శివశంకరరావు తాపీ పని, ఉమామహేశ్వరి కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను బాగా చదివించి ప్రయోజకుల్ని చేస్తామని అన్నారు. హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

యూపీ నుంచి వచ్చిన కుటుంబానికీ లబ్ధి

ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చి చనుబండలో స్థిరపడిన కె. జితేంద్ర కుమార్, మాలతీదేవి దంపతులకు నలుగురు సంతానం కాగా, ముగ్గురు పిల్లలు రితిక్ కుమార్, సునయనాదేవి, మహిదేవిలకు తల్లికివందనం పథకం కింద రూ. 39 వేలు బ్యాంకు ఖాతాకు జమ కావటంతో ఆ కుటుంబం ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. చనుబండ సెంటర్ లో జితేంద్రకుమార్ పానీపూరి బండి పెట్టుకొని జీవిస్తున్నాడు. ఇతను టీడీపీ వీరాభిమాని. తాను యూపీలో ఉండగా సమాజ్‌వాది పార్టీలో చురుగ్గా పనిచేసేవాడినని, ఆ పార్టీ గుర్తు సైకిల్ కావటంతో, ఇక్కడకు వచ్చాక టీడీపీ పట్ల ఆకర్షితుడైనట్టు జితేంద్రకుమార్ తెలిపాడు.

150 మందికి కంటి వైద్య పరీక్షలు

ముసునూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గుడిపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. టీడీపీ నాయకులు కొల్లి గంగారామ్, మందలపు ధర్మరాజు తదితరులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కాషియా, వినోద్ సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 60 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. 25 మందికి కళ్లజోళ్లు అందజేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులను అందజేశారు.

నాణ్యమైన చేప పిల్లల ఎంపికే కీలకం

కలిదిండి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన చేప పిల్లల ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాసిరకం చేప పిల్లల్లో ఎదుగుదల లేక రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారన్నారు. చేప పిల్లలను కొనుగోలు చేసే సమయంలో వాటికి ఆక్వా ల్యాబ్‌లో పరీక్షలు చేయాలని, వ్యాధులు లేవని నిర్ధారణ అయిన చేప పిల్లలనే కొనుగోలు చేయాలన్నారు. అలాగే వాటి వయస్సుకు తగ్గ బరువు, పొడవు ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలన్నారు. చేప పిల్లలను చెరువుల్లో వదిలినప్పటి నుంచి నాణ్యమైన మేత వేయాలన్నారు. చెరువుల్లో చేప పిల్లలు వేసేటప్పుడు మత్స్యశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు.



చినపాలపర్రులో ముంపులో ఉన్న వెదజల్లిన వరి పొలాలు

ముంపు నుంచి తేరుకునేనా..?

పొంగి ప్రవహిస్తున్న డ్రెన్లు.. వెదజల్లిన వరి పొలాలకు నష్టమంటున్న అన్నదాత

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కొనసాగుతుండటం, తిరిగి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ముదినేపల్లి ప్రాంతంలో వెదజల్లిన సార్వా వరి పొలాలు ముంపు నుంచి తేరుకునే అవకాశాలు కనిపించటం లేదు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వెదజల్లిన వరి విత్తనాలు ముంపులో ఉండి పోయాయి. పొలాల నుంచి నీరు బయటికి వెళ్లే మార్గం లేకుండా పోయింది. మీడియం, మైనర్ డ్రెన్లతోపాటు మేజర్ డ్రెన్లు కూడా పొంగి ప్రవహిస్తున్నందున పొలాల నుంచి నీరు తగ్గుముఖం పట్టడం లేదు. ఉప్పరగూడెం వంతెన వద్ద పెదలంక డ్రెన్‌లో గుర్రపు డెక్క, తూటు కాడ పెద్ద ఎత్తున పేరుకుపోవటంతో అన్నవరం మీడియం డ్రెన్‌లో నీరు స్తంభించింది. పెదగొన్నూరు, ఉప్పరగూడెం, సంకర్షణపురం, కాకరవాడ, ముదినేపల్లి, చినపాలపర్రు గ్రామాల ఏరియాల్లోని వందలాది ఎకరాల్లో విత్తనాలు వెదజల్లిన పొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు తగ్గని పరిస్థితుల్లో విత్తనాలు పాడైపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి విత్తనాలు వెదజల్లేందుకు రూ.6 వేలకు పైగా ఖర్చయిందని రైతులు చెబుతున్నారు.



డ్రెన్లు బాగు చేయాలి

మీడియం, మైనర్ డ్రెన్లలో డెక్క, తూటుకాడ నిర్మూలించాలి. డ్రెన్లలో నీరు కదలక పొలాల్లో ముంపు తగ్గటం లేదు. వెదజల్లిన వరి విత్తనాలు పనికి వచ్చేలా కనిపించడం లేదు.

- మారుబోయిన రామ్మోహనరావు, రైతు, కాకరవాడ



వర్షాల వల్ల నష్టమే

భారీ వర్షాలు వెదజల్లిన సార్వా వరి పొలాలకు నష్టం కలిగించాయి. ఇప్పటికే ఎకరానికి రైతులకు రూ.6 వేలు ఖర్చయింది. డ్రెన్లలో డెక్కను నిర్మూలించాలి. లేకుంటే ముంపు తగ్గదు.

-బండారు పాండురంగారావు, రైతు, ఉప్పరగూడెం

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి చోరీ

తలుపులు పగులగొట్టి 60 కాసుల బంగారు ఆభరణాల అపహరణ

ఏలూరు క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి దొంగలు ఇంటి తలుపులు పగుల గొట్టి 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు తూర్పు వీధి జిల్లెళ్ళమూడి వారి వీధిలో కామాడ జాబిల్లి నివాసం ఉంటున్నారు. ఆమె బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదివారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చారు. 12.30 గంటల సమయంలో స్కూల్ సిబ్బంది ప్రిన్సిపాల్ ఇంటికి వెళ్లగా అప్పుడు కూడా ఆ ఇంటి తలుపులు భద్రంగానే ఉన్నాయి. 12.30 నుంచి 2 గంటల మధ్యలో దక్షిణంవైపు ఉన్న తలుపులను పగులగొట్టి దొంగలు ఆ ఇంట్లోకి ప్రవేశించి మూడు బెడ్‌రూమ్స్‌లో ఉన్న 60 కాసుల బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకు పోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీ సులకు ఆమె ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఎస్‌ఐలు నాగబాబు, మదీనా బాషా, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు క్లూస్ టీమ్, వేలిముద్ర నిపుణులు, పోలీసు జాగిలాలను రప్పించి పూర్తిస్థాయిలో ఆధారాలను సేకరించడానికి అన్ని కోణాల్లో పరిశీ లన చేశారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొందరు విద్యార్థులకు జాప్యం

(5వ పేజీ తరువాయి)

అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడకపోవడానికి ప్రధాన కారణం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాల సొమ్ములు జమవుతాయి. పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ఖాతా తెరిస్తే నగదు జమవుతుందని తెలుస్తోంది.

ఆందోళన చెందాల్సిన పనిలేదు..
సోషల్ వెల్ఫేర్ ఈడీ ముక్కంటి

ఇంటర్, 9, 10 తరగతిలో విద్యార్థులకు తల్లికి వందనం పడలేదు. నిధులు జమ కాని తల్లులు పోస్టాఫీస్‌లో ఖాతా తెరవాలి. ఇందుకోసం తమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. మరో రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ప్రతీ విద్యార్థికి తల్లికి వందనం జమచేసేందుకు చర్యలు చేపట్టాం.

కొల్లేరు సమస్యలు కోకొల్లలు

(5వ పేజీ తరువాయి)

పరిరక్షణ కోరుతూ కొందరు ఏదొక రూపంలో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ వస్తున్నారు. గతంలో కొల్లేరు ప్రక్షాళనకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణప్రియులు డిమాండ్ మేరకే కొల్లేరు ఆపరేషన్‌కు దారితీసింది.

సాధికార కమిటీపైనే అందరి చూపు

కొల్లేరు పరిస్థితిని అధ్యయనం చేయడానికి మరోమారు కేంద్ర సాధికార కమిటీ రెండురోజుల పాటు కొల్లేరు ప్రాంతంలో పర్యటించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అనంతరం ఈ బృందం మంగళ, బుధవారాల్లో కొల్లేరులో క్షేత్రస్థాయిలో పర్యటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొల్లేరు ప్రాంతంలో ప్రజలెదుర్కొంటున్న కష్టాలపై ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కూడా ఈ నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పుడు సాధికార కమిటీ నేరుగా కొల్లేరులో పర్యటిస్తున్న నేపథ్యంలో స్థానికులంతా తాము ఎదుర్కొంటున్న కష్టాలు, జీవనోపాధిలో ఎదురవుతున్న ఆటంకాలు, కాంటూరు కుదింపు వ్యవహారం పూర్తిగా కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు సమాయత్తం అయ్యారు. జిరాయితీ భూములు ఇప్పటికే దాదాపుగా 22 వేల ఎకరాలకు పైగా ఉన్నట్లు పేర్కొంటూనే కొల్లేరు ప్రాంతంలో పాఠశాలలు, నివాసిత ప్రాంతాలు, తాగునీటి చెరువులు, ఇతరత్రా వాటిని మినహాయించాలన్న డిమాండ్‌ను లేవనెత్తబోతున్నారు. ఇప్పటికే కొంతమంది విద్యావంతులు సాధికార కమిటీకి అర్థమయ్యేలా వినతులు సిద్ధం చేశారు. ఈసారి కమిటీ సమర్పించే నివేదిక అత్యంత కీలకం కావడంతో ఒకింత జాగ్రత్తగా మెలగాలని కూడా కొల్లేరు వాసులు ఒక నిర్ణయానికి వచ్చేశారు. సాధికార కమిటీ పర్యటన పూర్తి వివరాలు జిల్లా యంత్రాంగం వెల్లడించాల్సి ఉంది.

గోవిందా.. గోవింద

భక్తులతో ద్వారకాతిరుమల కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని దివ్యసన్నిధి ఆదివారం భక్తజనులతో నిండిపోయింది. సెలవురోజు కావడంతో ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. గోవిందా.. గోవింద అంటూ శ్రీవారి నామస్మరణ మార్మోగింది. దాదాపు 15వేలకు పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఉచిత తీర్థప్రసాదాలు, ఆ తరువాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



శ్రీశ్యామలాంబకు 108 మామిడి పండ్ల సమర్పణ

కైకలూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారికి ఆదివారం ఆకివీడుకు చెందిన గోనెల శ్రీనివాస పురుషోత్తం కుటుంబీకులతో కలసి అమ్మవారికి 108 మామిడి పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భీమకిషోర్ విశేష పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా జ్యేష్ఠ మాసంలో శ్రీ శ్యామలాంబ అమ్మవారికి శ్రీనివాస పురుషోత్తం ఫలాలు, లక్ష పసుపు కొమ్ములతో పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో శేఖర్ వారిని సత్కరించారు.



కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం

ముదినేపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాక, ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు దేవస్థానం వద్ద పుట్టలో పాలు పోసి పూజలు జరిపారు. పాల పొంగళ్లతో మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు జరిపారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షణ లో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాల గంగాధర్ తిలక్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



వీరాంజనేయ స్వామికి సహస్రార్చన

ఆగిరిపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వీరాంజనేయ స్వామికి తమలపాకులతో సహస్రార్చనను అర్చకులు వేదాంతం శేషబాబు నిర్వహించారు. ఈదులగూడెంలో మే 31న వీరాంజనేయస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆదివారం 16వ రోజు వేడుకను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మండుపల్లి చెన్నకేశవరావుకు సత్యభామ వర్సిటీ డాక్టరేట్

నూజివీడు టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మండుపల్లి శివ చెన్నకేశవరావు చెన్నై సత్యభామ యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పొందారు. విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేసిన ఆయన కాకినాడ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ అనంతరం గన్నవరం ఉషారామ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. సత్యభామ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీలో డాక్టర్ పాకియాలక్ష్మీ మార్గ నిర్దేశకత్వంలో సిమెంట్‌లో పాక్షిక ప్రత్యామ్నాయంగా వ్యవసాయ పారిశ్రామిక వ్యర్థాలను ఉపయోగించి గ్రీన్ కాంక్రీట్ ప్రవర్తనపై చేసిన పరిశోధనకుగాను ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

హెల్మెట్ రక్షణ కవచం.. ధరించకుంటే చర్యలు తప్పవు

ఆగిరిపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరని, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం లేకుండా ఉంటుందని ఎస్‌ఐ శుభశేఖర్ తెలిపారు. నూజివీడు రోడ్డులో గల హైస్కూల్ వద్ద ఆదివారం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే చలానాలు విధిస్తామని హెచ్చరించారు.